

మనం

కరీంనగర్

జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

మంగళవారం | 15 | ఆగస్టు | 2023 | పేజీలు : 7


# ఇంటింటా ఇన్నోవేటర్‌కు జిల్లా నుండి ఇద్దరు ఎంపిక



## కలెక్టర్ బదావత్ సంతోష్



మంచిర్యాల, ఆగస్టు 14 (మనంన్యూస్)ః ప్రజల్లో దాగి ఉన్న సృజనాత్మకత, నైపుణ్యాలను వెలికి తీసేందుకు అన్ని వర్గాల వారికి అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి జిల్లా నుండి ఇద్దరు అభ్యర్థులు ఎంపికైనట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సముదాయంలో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్, జిల్లా సైన్స్ అధికారి మధుబాబుతో కలిసి ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ రంగాలలో ప్రజోపయోగకర వినూత్న ఆవిష్కరణలు, నూతన పరికరాలు ఆవిష్కరించడం ద్వారా ప్రజలకు సులవైన మార్గాలలో పనులను సులభతరం చేయడంతో పాటు సౌకర్యాలు అందించేందుకు ఆవిష్కరణలు రూపొందించే ఇన్నోవేటర్లను గుర్తించి ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం ద్వారా ప్రోత్సహిస్తుందన్నారు. ఈ క్రమంలో ప్రతి సంవత్సరం నిర్వహించే ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమానికి జిల్లా నుండి ఇద్దరు ఎంపికయ్యారని తెలిపారు. జిల్లాలోని మందమర్రి ప్రాంతానికి చెందిన కటకం వినయకుమార్ మోటారుతో నడిచే సైకిల్ ఆవిష్కరించారని, తాండూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎండి. మక్సుద్ అత్యంత తక్కువ ఖర్చుతో ప్రొజెక్టర్ రూపొందించారని తెలిపారు. ఈ ఆవిష్కరణలను ఈ నెల 15వ తేదీన జిల్లాలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రదర్శించి ఆవిష్కర్తలకు ప్రశంసా పత్రం అందించనున్నట్లు తెలిపారు.

# జాతీయ పతాకాన్ని ఎగరేయడం దేశభక్తికి నిదర్శనం



## బోయినపల్లి వినోద్ కుమార్

హుజురాబాద్ రూరల్, ఆగస్టు 14 (మనం న్యూస్)ః స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరు జాతీయ పతా కాన్ని ఎగురవేయడం దేశభక్తికి నిదర్శనమని రాష్ట్ర ప్రణాళిక సంఘ ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. సోమవారం హుజురాబాద్ పట్టణంలోని 28వ వార్డులో ఆజాది కా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు ఉచితంగా జాతీయ పతాకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది దేశభక్తులు తమ ప్రాణాలను సైతం వదులుకొని మనకు స్వాతంత్రం తీసుకొని వచ్చారన్నారు. ఆగస్టు 15న ప్రతి ఒక్కరు తమ ఇంటి పైన జాతీయ పతాకాలను ఆవిష్కరించాలని వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, కౌన్సిలర్ కల్లేపల్లి రమాదేవి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, మాజీ చైర్మన్ వడ్లూరు విజయకుమార్, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, బిఆర్ఎస్ నాయకులు మొలుగురి పూర్ణచందర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# గృహ లక్ష్మి పథకంలో రేషన్ కార్డు నిబంధన సడలించాలి

## జడ్పీటిసి సభ్యులు గీకురు రవీందర్



చిగురుమామిడి, ఆగస్టు 14 (మనం న్యూస్)ః నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహ లక్ష్మి పథకంలో ఆహార భద్రత కార్డు తప్పనిసరి అనే నిబంధనను సడలించాలని చిగురుమామిడి జడ్పీటిసి సభ్యులు గీకురు రవీందర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదల కుటుంబాలు ఇంటి నిర్మాణానికి గృహలక్ష్మి పథకంతో 3 లక్షల రూపాయల ఆర్థిక సహాయమందించడం హర్షణీయమన్నారు. దరఖాస్తు దారులు ఆహార భద్రతా కార్డు కలిగి ఉండాలనే నిబంధన ఉండడం మూలంగా చాల మంది నిరుపేదలకు ఈ పథకం వర్తించడం లేదన్నారు. గత ఐదారు సంవత్సరాలుగా అర్హులైన అందరికి రేషన్ కార్డులు జారీ చేసే ప్రక్రియలో జాప్యం జరిగిన కారణంగా ఈ నిబంధనను తొలగించాల్సిన అవసరముందన్నారు. దారిద్ర రేఖకు దిగువ నుండి పూర్తి అర్హత కలిగిన కుటుంబాలకు ఇప్పటికీ రేషన్ కార్డులు అందుబాటులోకి రాలేదన్నారు. మహిళల పేరిట మాత్రమే దరఖాస్తులు సమర్పించాల్సి ఉండగా కొన్ని సంవత్సరాలుగా వివాహం చేసుకున్న మహిళల పేర్లు రేషన్ కార్డుల్లో నమోదు కాలేదన్నారు. గత ఆరు సంవత్సరాలుగా రేషన్ కార్డుల్లో ఎలాంటి చేర్పులు, మార్పులు జరుగ లేదన్నారు. ఒకే కార్డులో నమోదైన కొడుకులకు పెళ్లిళ్లు అవడం మూలాన వేరు వేరు కుటుంబాలుగా బతుకుతున్నప్పటికీ వేరు వేరు రేషన్ కార్డులు జారీ చేయ బడలేదన్నారు. ఈ కారణాల వల్ల గృహలక్ష్మి పథకానికి పూర్తి అర్హతలు ఉన్నప్పటికీ రేషన్ కార్డు లేని కారణంగా నిరుపేద కుటుంబాలు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారని రవీందర్ తెలిపారు. రేషన్ కార్డుల జారీ విషయంలో జరిగిన జాప్యం కారణంగా ఆహార భద్రత కార్డు తప్పనిసరిగా ఉండాలనే నిబంధనను సడలించి, రేషన్ కార్డు లేని వారికి ఆదాయ ధృవీకరణ పత్రంతో అర్హులుగా ప్రకటించాలని ప్రభుత్వానికి విన్నవించారు.

## హైమాక్స్ లైట్స్ ప్రారంభం



శంకరపట్నం, ఆగస్టు 14 (మనం న్యూస్)ః శంకరపట్నం మండలం చితలపల్లి గ్రామంలో ఎంపిటిసి సభ్యులు పెద్ది శ్రీనివాస్ రెడ్డి నిధులతో ఏర్పాటు చేసిన రెండు హైమాక్స్ లైట్లను సోమవారం ప్రారంభించారు, ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు లింగంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు ఉమ్మెంతల సతీష్ రెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు పల్లె సంజీవరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, చింతలపల్లి గ్రామ పంచాయతీ పాలకవర్గం, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు గంట మహిపాల్, కొత్తగట్టు మత్స్య గిరీంద్ర స్వామి ఆలయ చైర్మన్ సాగి మలహాల్ రావు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఉమ్మెత్తల సతీష్ రెడ్డి, గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు స్వామి, పాల్గొన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన మామిడి అంజయ్య



చిగురుమామిడి, ఆగస్టు 14 (మనం న్యూస్)ః చిగురుమామిడి మండలం గునుకులపల్లి గ్రామానికి చెందిన సిద్ది రాజమల్లు (57) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మరణించగా మృతుని కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మామిడి అంజయ్య సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతిని తెలిపిన అంజయ్య మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు సన్నీళ్ల మల్లేశం, సింగిల్ విండో వైస్ చైర్మన్ కరివేద మహేందర్ రెడ్డి, నాయకులు కొమ్మెర మహేందర్ రెడ్డి, కూన రాజయ్య, కూన శ్రీనివాస్, గునుకుల లక్ష్మారెడ్డి, బరిగెల రాజు, సన్నీళ్ల ఎల్లయ్య, పుట్టల సారయ్య, కూన మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ఓపెన్ జిమ్ పరికరాలు పునరుద్ధరించాలి

### బిజెపి నాయకులు ముప్పిడి శ్రీధర్




వేములవాడ టౌన్, ఆగస్ట్ 14 (మనం న్యూస్): వేములవాడ పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ లో వ్యాయామ పరికరాలను పునరుద్దరించాలని బిజెపి నాయకులు ముప్పిడి శ్రీధర్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నాలుగు ఏళ్ల కిందట నెలకొల్పిన ఓపెన్ జిమ్‌లోని పరికరాలు పనికి రాకుండా పోయాయన్నారు. వ్యాయామ పరికరాలకు బేరింగ్‌లు పనిచేయకపోవడంతో ప్రజలకు అసౌకర్యంగా ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో వ్యాయామం చేసే సమయంలో ప్రజలు గాయాలపాలవుతున్నారన్నారు. సంక్రమంగా లేని పరికారాలతో వ్యాయామం చేయడం వల్ల అనేక ఇబ్బందులు పడాల్సివస్తుందని తెలిపారు. దీనిపై గతంలో మునిసిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని, ప్రస్తుతం పనిచేస్తున్న క మిషనర్ దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా ఓపెన్ జిమ్ లో వ్యాయామ పరికరాయాలను యధాస్థితిగా పునరుద్దరించాలని కోరారు.

# రెండవ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాల్సిందే

చిగురుమామిడి, ఆగస్టు 14 (మనం న్యూస్)ః ప్రభుత్వ ఆసుపత్రిలో పదహారు సంవత్సరాలనుండి వెట్టి చాకిరీ చేస్తున్న తమను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎలాంటి షరతులు లేకుండా భేషరతుగా రెగ్యులర్ చేయాలని కోరుతూ రెండవ ఏఎన్ఎం లు సోమవారం వైద్యాధికారి ధర్మనాయక్, తహసిల్దార్ నరేందర్ లకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత సొంత రాష్ట్రంలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ విధానము అనేది ఉండదని, అందరినీ రెగ్యులర్ చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ నమ్మబలికి, ఇంతవరకు రెండవ ఏఎన్ఎం లను రెగ్యులర్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయకపోగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా తమతో వెట్టి చాకిరి చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో ప్రాణాలకు సైతం తెగించి పోరాడామని ఈ సందర్భంగా గుర్తు చేశారు.ముఖ్యమంత్రి కేసీఆర్ కు, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావుకు ఎన్నోసార్లు వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ, వారు తమ సేవలను గుర్తించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ యూనియన్ ఆదేశాల ప్రకారం ఈ నెల 16వ తేదీ నుండి సమ్మె చేస్తామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేయాలని లేని పక్షంలో రానున్న రోజుల్లో సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో



రెండవ ఏఎన్ఎంలు గాలిపెల్లి స్వరూప,పన్యాల రజిత,జెల్ల కవిత, భూక్య స్వాతి, రొంటాల శైలజ, అంతడుపుల సరస్వతి, మాలతి, మమత తదితరులు పాల్గొన్నారు.

## గద్దర్ గొప్ప సామాజిక విప్లవకారుడు

### కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రవీందర్



లక్సెట్టిపేట్, ఆగస్టు 14 (మనం న్యూస్)ః గద్దర్ గొప్ప సామాజిక విప్లవకారుడని కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార అవార్డు గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'యుద్దనౌక పోరుకేక' పేరుతో గద్దర్ స్మారక సదస్సును అన్ లైన్ ద్వారా నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రవీందర్ మాట్లాడుతూ నలిగిన బతుకుల్ని, చెదిరిన కలల్ని, ప్రజల గోసలను వస్తువులుగా తీసుకొని గద్దర్ సమాజాన్ని చైతన్య పరిచారన్నారు. ప్రజా సమూహ పాటగా గద్దర్ అందరి హృదయాలను గెలిచారని వివరించారు. గద్దర్ ఒక ఉద్యమ చైతన్య శిఖరం అని కొనియాడారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓజా మాట్లాడుతూ గద్దర్ తెలంగాణ ఉద్యమానికి చేసిన సేవలను కొనియాడారు. గద్దర్ సామాన్యుడి కళా ప్రతీక అని, సామాజిక ఉద్యమాలతో ఆయన గొప్పవిజయాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి అదిలాబాద్ అన్ని డిగ్రీ కళాశాలల అధ్యాపకులు విద్యార్థులతో పాటు వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ గంగయ్య, తెలుగు విభాగం అధ్యక్షులు డాక్టర్ గోలి శ్రీలత, కార్యక్రమ కో-ఆర్డినేటర్ డాక్టర్ తన్నీరు సురేష్, అధ్యాపకులు డాక్టర్ శ్రీధర హరీశ్, సవిత, మౌజుల కుమార స్వామి, డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ చంద్ర శేఖర్, సంధ్యారాణి, కవిత, మల్లయ్య, సత్యనారాయ, మహేష్ కుమార్, విజయ్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్‌ల దీక్షకు బిసి విద్యార్థి సంఘం మద్ధతు



సిరిసిల్ల అర్బన్, ఆగస్టు 14 (మనం న్యూస్)ః జిల్లా కేంద్రంలో మాజీ సర్పంచులు చేస్తున్న రిలే నిరాహార దీక్షకు బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ కంచర్ల రవి గౌడ్ మద్దతు తెలిపారు. సోమవారం నిరాహారదీక్ష శిబిరాన్ని సందర్శించిన ఆయన మాజీ సర్పంచ్‌లకు సంఘీభావం ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధికి మాజీ సర్పంచులు ఎంతో కృషి చేశారన్నారు. వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచులకు పింఛన్, హెల్త్ కార్డు ఇవ్వాలని పూర్తిగా నిరుపేదైన మాజీ సర్పంచులకు డబుల్ బెడ్ రూమ్‌లు అందించాలన్నారు. గత ఏడు రోజులుగా దీక్షలు నిర్వహిస్తోన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమని, ఇప్పటికైనా వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు రుద్రవేణి కుమార్, నాయకులు కృష్ణ, నవీన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన త్వరగా పూర్తి చేయాలి

### తహసిల్దార్ రమేష్ బాబు



ఇల్లందకుంట, ఆగస్టు 14 (మనం న్యూస్)ః నిరుపేదల సొంతింటి కల సాకారం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకం కోసం ప్రజలు చేసిన దరఖాస్తుల పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయాలని తహసిల్దార్ గట్ల రమేష్‌బాబు సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో గృహలక్ష్మి దరఖాస్తుల విషయమై సంబంధిత అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ఆయా గ్రామాల సహాయకులతో దరఖాస్తులను త్వరగా పరిశీలన చేయించాలన్నారు. ఈనెల 18వ తేదీ లోపు దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో వెంకటేశ్వర్లు, ఇతర శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లాలో బిఆర్ఎస్‌కు

# ఒక్క సీటు కూడా రాదు

- అన్ని స్థానాల్లో గెలుస్తామన్నది మంత్రి కల మాత్రమే
- కేబుల్ బ్రిడ్జి రోడ్డు కుంగుతున్నది కప్పిపుచ్చడానికే 'వీకెండ్ మస్తి'
- గంగుల ఫామ్‌హౌస్ స్థలం వక్ఫ్‌బోర్డు ఆస్తి కాదని నిరూపిస్తే దేనికైనా సిద్ధం..

: నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి

కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 14 (మనం న్యూస్): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పదమూడు సీట్లు గెలుస్తామన్నది కేవలం మంత్రి గంగుల కమలాకర్ కల మాత్రమేనని, రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేబుల్ బ్రిడ్జి రోడ్డు మళ్లీ కుంగుతుందన్న భయంతో ఆ విషయాన్ని పక్కదోవ పట్టించడానికి మంత్రి ఏవేవో వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. సోమవారం ప్రెస్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 132 కోట్లతో నగరంలో మట్టి రోడ్లు లేకుండా చేస్తున్నామని అందులో ఇంకా 25 కోట్లు మిగులుతున్నాయని గంగుల చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నగరంలో వెయ్యి32 కోట్లు ఖర్చు చేసినా ఇంకా మట్టి రోడ్లు, డ్రైనేజీలు మిగిలి ఉంటాయని అన్నారు. విలీన గ్రామాలు, శివారు కాలనీల్లో ఎంతో చేయాల్సింది ఉందని పేర్కొన్నారు. భారీ వాహనాలు వెళ్తే కేబుల్ బ్రిడ్జి మళ్లీ కుంగుతుందని వీకెండ్ మస్తి పేరు మీద ప్రజల దృష్టి మళ్ళించే ప్రయత్నం చేస్తున్నారని కోమటిరెడ్డి ఆరోపించారు. వీకెండ్ రెండు రోజులు వదిలి పెడితే మిగితా రోజుల్లో ఎందుకు భారీ వాహనాల కు అనుమతించడం లేదని ప్రశ్నించారు. సమద్ నవాబ్ మాట్లాడుతూ ఖాజిపూర్ లోని గంగుల కమలాకర్ ఫామ్ హౌస్ వక్ఫ్ బోర్డు ఆస్తి కాదని నిరూపిస్తే తాము ఏ శిక్షకైనా సిద్ధమే అన్నారు. ఆయన



ఫామ్‌హౌస్ నిర్మించుకున్న స్థలం వక్ఫ్‌బోర్డుకు సంబంధించిన ఆస్తిగా తెలిపే పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. ఆ భూమి తన ఆస్తి అని గంగుల కమలాకర్ వారం రోజుల్లోగా నిరూపించాలని, లేకపోతే అది వక్ఫ్ ఆస్తి అని ఒప్పుకొని కమలాకర్ ప్రకటించినట్టు వక్ఫ్ భూమితో పాటు మూడు ఎకరాలు ఇవ్వాలని సవాల్ విసిరారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఎండి తాజ్, రహ్మత్ హుస్సేన్, కుర్ర పోచయ్య, దండి రవీందర్, ముల్కల కవిత, ఎండి.చాంద్, జీడి రమేష్, ఎగ్గడి శారద, లయాక్, నెల్లి నరేష్, నాగుల సతీష్, ముక్క భాస్కర్, మహాలక్ష్మి, సయ్యద్ ఖలీల్, ముల్కల యోన తదితరులు పాల్గొన్నారు.




## వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన

## కోరా జాన్సన్ విద్యార్థులు




కరీంనగర్,ఆగస్టు14( మనంన్యూస్): పార్టిషన్ హారర్స్ రియంబరెన్స్ రిలేటెడ్ పార్టిషన్ ఆఫ్ ఇండియా కోసం డిఎఫ్ఎస్ ఆదేశాల మేరకు నగరంలోని ఇండియన్ బ్యాంక్ ఎగ్జిబిషన్ మేలాని నిర్వహించారు. ఇందులో కోరా జాన్సన్ విద్యార్థుల పాల్గొని బ్యాంక్ వారు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. విద్యార్థులు బ్యాంకు వలన లాబాలు ప్రయోజనాలను వ్రాత పూర్వకంగా విశధీకరించారు.ఈ పోటీలో పాల్గొన్న నందిని, పి,ఐశ్వర్య, కె. సాహితీలకు మొదటి బహుమతి,డి అనాధిక,ఎ.అక్షతేజశ్రీ,ఎం.దివ్యలకు రెండవ బహుమతి, హర్షవర్ధన్, రాగిణి, దివ్య లకు మూడవ బహుమతులను జోనల్ మేనేజర్ ఎస్. శ్రీనివాస రావు, బ్రాంచ్ మేనేజర్, ఎమ్ శివరాం లు ప్రధానం చేశారు. ఇందులో భాగంగా పాఠశాల యాజమాన్యం. చైర్మన్ మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు వరప్రసాద్, రాంరెడ్డి సింహాచలం హరిక్రిష్ణ, వంగల సంతోష రెడ్డి గార్లు పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## విశాల పట్టు శారీస్ మాల్

## ప్రారంభించిన నేహా శెట్టి, కార్తికేయ



వేములవాడ టౌన్, ఆగస్ట్ 14, (మనం న్యూస్): వేములవాడ పట్టణంలోని విశాల షాపింగ్ మాల్ లో నూతన పట్టు శారీస్ విభాగంను సినీ నటీ నేహా శెట్టి, హీరో కార్తికేయ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సినీనటి నేహ శెట్టి, హీరో కార్తికేయ మాట్లాడుతూ విశాల షాపింగ్ మాల్ లో పట్టు శారీస్ విభాగంను ప్రారంభించడం ఆనందంగా ఉందని అన్నారు. విశాల షాపింగ్ మాల్ లో అన్ని రకాల వస్త్రాలు లభిస్తున్నాయని, విశాల షాపింగ్ మాల్ మరింత ప్రజా ఆదరణ పొందాలని అన్నారు. కాగా నేహ శెట్టి, కార్తికేయను చూడడానికి భారీ ఎత్తున ప్రజలు షాపింగ్ మాల్ కు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామతీర్థపు మాధవి-రాజు, కౌన్సిలర్స్, నాయకులు, షాపింగ్ మాల్ యజమానులు వేముల దేవయ్య, లక్ష్మి, శ్రీనివాస్, విష్ణు, వెంకన్న పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



రామకృష్ణాపూర్,ఆగష్టు 14 (మనం న్యూస్): మందమర్రి సర్కిల్ లోని రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్ల కు,అనుమానితులకు మందమర్రి సిఐ కార్యాలయంలో సిఐ మహేందర్ రెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రౌడీ షీటర్లను శాంతి భద్రతలకు భంగం కలుగకుండా నేర ప్రవృత్తి వదిలి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు



# బీజేపీ శ్రేణుల తిరంగా యాత్ర

వేములవాడ టౌన్, ఆగస్ట్ 14,(మనం న్యూస్)వేములవాడ పట్టణంలో సోమవారం బీజేపీ శ్రేణులు తిరంగా యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా భారత స్వాతంత్ర్య దినోత్సవ వజ్రోత్సవాలను పురస్కరించుకొని పట్టణ పురవీధుల గుండా జాతీయ పథకాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన స్వాతంత్ర్య సమరయోధుల గొప్పతనాన్ని చాటిచెప్పేందుకే తిరంగా యాత్ర చేపట్టామన్నారు. దేశం కోసం, దేశ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేస్తున్న వారందరికీ నరేంద్ర మోడీ ప్రభుత్వం పూర్తి మద్దతుగా ఉంటుందని అన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో భారత దేశం అన్ని రంగాల్లో ప్రపంచంలో అగ్రగామిగా నిలుస్తుందని, దేశం కోసం, ధర్మం కోసం పనిచేసే ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎట్టం మహేష్, అసెంబ్లీ కన్వీనర్ మార్తా సత్తయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, బిజెపి పట్టణ అధ్యక్షులు కౌన్సిలర్ రేగుల సంతోష్ బాబు, జక్కుల తిరుపతి, కోల కృష్ణ స్వామి, ముప్పిడి శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్, సిరికొండ శ్రీనివాస్, బుర్ర శేకర్, సురేందర్ రావు, వెంకటేశ్వర రావు, రాకేశ్, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్జీ-3 మరియు ఏపిఏ ఏరియాలో

## పర్యటించిన జిఎం ఓసిపిలు



రామగిరి,ఆగస్టు 14 మనం న్యూస్ : సింగరేణి సంస్థలో నూతనంగా జనరల్ మేనేజర్ ఉపరితల గనులు(ఓసిపిలు) గా పదవి బాధ్యతలను స్వీకరించిన డివిఎస్ సూర్యనారాయణ రాజు సోమవారం ఆర్జీ-3 మరియు ఏపిఏ ఏరియాలో మొదటిసారి పర్యటించారు. వారిని జిఎం కార్యాలయము నందు జరిగిన కార్యక్రమంలో జిఎం ఆర్జీ-3 ఎన్.సుధాకరరావు,జిఎం ఏపిఏ కే.వెంకటేశ్వర్లులతో పాటు ఇతర అధికారులు పుష్పగుచ్ఛాన్ని అందజేసి,శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జీఎం ఆర్జీ-3 ఎన్.సుధాకర్‌రావు తో పాటు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి,ఉపరితల గనులలో బొగ్గు,మట్టి తొలగింపు,యంత్రాల వినియోగం,వాటి పనితీరు మొదలగు అంశాలపై చర్చించారు. తరువాత ఓసిపి-1,ఓసిపి-2 ఉపరితల గనులను సందర్శించి క్వారీలో నడుస్తున్న షావల్స్, క్రషర్,స్ప్రెడర్ మొదలగు యంత్రాల పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాలను సాధించుకోవడానికి తగిన చర్యలను చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ పి.ఎలీషా,ప్రాజెక్ట్ అధికారులు ఎఎన్.రాధాకృష్ణ,కె.రాజేందర్,ప్రాజెక్ట్ ఆర్.శ్రీనివాస్,ఎం నాగరాజులతో పాటు ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# బీడీ కార్మికులకు జీవన భృతి ప్రకటించాలి

### బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్



రాజన్న సిరిసిల్ల, ఆగస్ట్ 14, (మనం న్యూస్): బీడీ కార్మికులకు ప్రభుత్వం జీవన భృతి ప్రకటించాలని బిఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన వేలాది మంది బీడీ కార్మికులతో జరిగిన ముట్టడి కార్యక్రమంలో దండి వెంకట్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించిన బీడీ కార్మికులకు షరతులు లేకుండా జీవన భృతి జీవో జారీ చేయకపోటే 2024 లో జరిగే ఎన్నికల్లో ఐటి, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ పై సిరిసిల్ల నియోజకవర్గంలో బీడీ కార్మికులిని పోటీ చేయిస్తామని ప్రకటించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు, మంత్రులు,రెండున్నర లక్షల జీవితం పొందుతున్న వారికి ఓట్లేసి అధికారం అప్పగిస్తే, 2016 ల ఎన్నికల్లో చేసిన వాగ్దానం అమలు చేయడంలో ఏమిటి ఇబ్బందని నిలదీశారు. ఎన్నికల ప్రకటన కంటే ముందే షరతులు లేకుండా జీవన భృతి జీవో జారీ చేయకపోతే ఒక్కో బీడీ కార్మికురాలిని పోటీ చేయిస్తామన్నారు.అనంతరం బిఎల్ టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కామారెడ్డి బిఎల్ఎఫ్ ఎమ్మెల్యే అభ్యర్థి సిరిగాద సిద్దిరాములు మాట్లాడుతూ వారంరోజుల్లో షరతులు లేకుండా జీవన భృతి ప్రకటన చేయకపోతే ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలను ఆహ్వానించి, భవిష్యత్తు కార్యాచరణకు సిద్ధం చేస్తామని తెలిపారు.మహిళా సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత మాట్లాడుతూ లక్షలాది మంది శ్రామిక మహిళలు పని చేసే బీడీ పరిశ్రమను సంక్షోభం నుండి సంక్షేమం వైపు తిరిగి నడిపించే బాధ్యత కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలపై ఉన్నదని విమర్శించారు. కేసిఆర్ ప్రభుత్వం షరతులు లేకుండా జీవన భృతి ప్రకటన విడుదల చేసే వరకు రాబోయే రోజుల్లో జరిగే పోరాటానికి పెద్ద ఎత్తున సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిఎల్ టియు రాష్ట్ర కమిటి సభ్యులు మేకల రాజేందర్,స్వామి,తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం, రాష్ట్ర కోషదికారి, స్తైయ్యద్, గురుమూర్తి, జిల్లా నాయకులు సతీష్, స్వరూప, రుక్మిణి, రజిత, రెహానా, లక్ష్మి, రాజేశ్వరి, భవాని, లత, గీత, రజిత, శ్రీలత, లావణ్య, భార్గవి, ఆసిన, మమత, అంజలి, తదితరులు పాల్గొన్నారు.

# రేణుక ఎల్లమ్మ గుడి నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్సీ



సుల్తానాబాద్,ఆగస్టు 14 మనం న్యూస్ : సుల్తానాబాద్ నారాయణపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి గుడిని ప్రభుత్వ విఫ్ ఎమ్మెల్సీ తానిపర్తి భాను ప్రసాద్‌రావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ శ్రీ రేణుక ఎల్లమ్మ గుడికి తన వంతుగా సహాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ శాఖ అధ్యక్షులు ఎర్రవెల్లి వేణుగోపాలరావు ,గ్రామ సర్పంచ్ మూల స్వరూప రాజేశంగౌడ్,కొదురుపాక గ్రామ సర్పంచ్ దేవరనేని సాగర్‌రావు,ఉపసర్పంచ్ ఎర్రవెల్లి రామారావు,గౌడ సంఘం సభ్యులు బిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెండువ ఏఎన్ఎంలను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని తహసీల్దార్ వినతిపత్రం అందజేత



సుల్తానాబాద్,ఆగస్టు 14 మనం న్యూస్ : నేషనల్ హెల్త్ మిషన్‌లో గత 18 సంవత్సరాలుగా వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు సబ్ సెంటర్లలో పనిచేస్తున్నటువంటి రెండవ ఏఎన్ఎంలను ఈసీ ఏఎన్ఎం లను వారధి ఏఎన్ఎంలను ప్రభుత్వం వెంటనే ఎలాంటి షరతులు లేకుండా భేషరతుగా రెగ్యులర్ చేసి ఏఎన్ఎంల నోటిఫికేషన్ వెంటనే రద్దు పరచాలని డిమాండ్ చేస్తూ గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న రెండవ ఏఎన్ఎంలు సమ్మెలో భాగంగా సోమవారం సుల్తానాబాద్ తహసీల్దార్ మధుసూధన్‌రెడ్డికి వినతి పత్రం అందజేసి తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాల్ని చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు సెకండ్ ఏఎన్ఎంలు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ విధానమే అనేది ఉండదని అందరినీ రెగ్యులర్ చేస్తానని చెప్పి ఇంతవరకు రెండవ ఎఎన్ఎమ్లను రెగ్యులర్ చేయలేదన్నారు. రెగ్యులర్ చేయకపోవా సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా మాతో వెట్టి చాకిరి చేపిస్తున్నారని వివిధ ఆన్‌లైన్ పనులు తమతో చేపిస్తూ చివరికి పరీక్షల డ్యూటీలు కూడా తమకే వేస్తున్నారని ఆరోపించారు.పై అధికారుల వేధింపులు కూడా మాపై తప్పడం లేదని పేర్కొన్నారు. ఎన్నో సంవత్సరాలుగా తమను రెగ్యులర్ చేయాలని సీఎం కేసీఆర్‌కు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావుకు వినతి పత్రాలు అందించినామని తెలిపారు.

అయినా కానీ ఇప్పటివరకు తమను రెగ్యులర్ చేయకపోవడంతో ఈ నెల 5వ తేదీ నుండి 16వ తేదీ వరకు సమ్మె నోటీసు ఇచ్చి రకాల ఆందోళన కార్యక్రమాలతో సమ్మె చేయడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేసినట్లు వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి రెండవ ఏఎన్ఎం లను రెగ్యులర్ చేయాలని లేనియెడల రానున్న రోజులలో తమ యొక్క ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెండవ ఎఎన్ఎంలు స్వరూప,రాణి,వీణ,శారధ,కవిత,రమాదేవి,రజిత,రాజేశ్వరి,భూలక్ష్మి,పద్మాంజలి, అరుణ,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటా జాతీయ జెండాలు ఎగురవేయాలి సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు



రామగిరి,ఆగస్టు 14 మనం న్యూస్ : రామగిరి మండలం రత్నాపూర్ లో సోమవారం గ్రామపంచాయతీ ఆవరణలో జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి ఒక్కరు జాతీయ జెండాను ఇంటిపై ఎగరవేయాలని సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ పెండ్లి రమ్య,కారోబార్ కొండపర్తి శ్రీనివాస్,ఎలుక కుమార్,కండె సంజీవ్,బెజ్జల సతీష్,బీమిని రమేష్,కోండు లక్ష్మి,లలిత తదితరులు పాల్గొన్నారు.

# సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 373 వ జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

ముత్తారం,ఆగస్టు 14 మనం న్యూస్ : జహుజనవిప్లవకారుడు పెత్తం దారి వ్యవస్థపై రజాకార్ల దోపిడి నిరంకుసత్వ పాలనను రూపుమాపి బానిస సంకెళ్ళ నుండి అణగారిన వర్గాల వారిని విముక్తి చేయాలని పోరాట మార్గమే దిక్కని అణగారిన వర్గాల వారందరిని ఏకం చేసి రజాకార్ల వ్యవస్థను,పెత్తందారి వ్యవస్థను రూపు మాపి కోటలన్నీ కైవసం చేసుకుని బహుజన వర్గాల్లో చైతన్యం తీసుకొచ్చిన వీరుడుగ గోల్కొండ కోటను ఏలిన చక్రవర్తి గౌడ జాతి అణిముత్యం శ్రీ సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 373 వ జయంతి తేది 18.08.2023 రోజున ముత్తారం మండలంలో గౌడ జన బందులంతా అన్ని వర్గాల వారిని కలుపుకుని ఒక పండగ వాతావరణంల జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా నాయకులు రవితేజ గౌడ్ సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోల విజయ్‌గౌడ్, తాళ్లపల్లి విష్ణువర్ధన్‌గౌడ్,దాసరి చంద్రమౌళిగౌడ్,బుర్ర రవీందర్‌గౌడ్,మల్యాల స్వామిగౌడ్,భూషణవేణ దేవేందర్‌గౌడ్,గడ్డం సంపత్‌గౌడ్,గోపగోని తిరుప తిగౌడ్, గోపగోని మొగిలి గౌడ్,నేరెళ్ల కుమార్‌గౌడ్,అగ్గి రవీందర్‌గౌడ్, బొంగో ని కుమార్‌గౌడ్,గోపగోని శ్రీనివాస్‌గౌడ్,గుర్రం సుధాకర్‌గౌడ్,బాలసాని రఘుప తిగౌడ్ ,సట్ల నారాయణగౌడ్,గడ్డం కిరణ్‌గౌడ్,లాలయ్యగౌడ్,గుర్రం మధుకర్ గౌడ్ ,మాచిడి రాముగౌడ్,ఆరెల్లి కిరణ్‌గౌడ్,మంథని సురేష్‌గౌడ్,గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.



# రామగిరి మండల ధూప దీప నైవేద్య అర్చకుల సమావేశం



రామగిరి,ఆగస్టు 14 మనం న్యూస్ : జై అర్చక జైజై అర్చక 14.08.2023 సోమవారం రోజున రామగిరి మండల ధూప దీప నైవేద్య అర్చకుల సమావేశం జరిగినది ఇట్టి సమావేశంలో మండల కమిటీని ఎన్నుకోవడం జరిగినది.ఇట్టి సమావేశానికి జిల్లా అధ్యక్షులు టి.శ్రీనివాస్ మూర్తి ఆధ్వర్యంలో జరిగినది. రామగిరి మండల అధ్యక్షునిగా పనికంటి సంతోష్‌శర్మ,ఉపాధ్యక్షులు తిరునహరి నవీన్,రుద్రం బట్ల పురుషోత్తను శర్మ,ప్రధాన కార్యదర్శి సౌమిత్ర కృష్ణమాచార్యులు,కార్యవర్గ సభ్యులు సౌమిత్ర మరళీధరచార్యులు,గౌరవ ముఖ్య సలహాదారు కోటగడ్డలో శివచందర్,ఎన్నుకోవడం జరిగింది.

# రేకుర్తిలో దారుణ హత్య

### పోలీసులకు లొంగిపోయిన నిందితుడు



కొత్తపల్లి, ఆగస్టు 14 (మనం న్యూస్)ః కరీంనగర్ జిల్లా రేకుర్తి 19వ డివిజన్ అంబేడ్కర్ కాలనీలో సోమవారం హత్య ఘటన చోటుచేసుకుంది. హత్యకు పాల్పడ్డ వ్యక్తి నేరుగా పోలీసుల వద్దకు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం. రేకుర్తి గ్రామానికి చెందిన మావురం నాగరాజు అనే వ్యక్తిపై మేక అజయ్ కుమార్ కత్తితో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మేక అజయ్ కుమార్ లొంగిపోయినట్లు పేర్కొన్నారు. హత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసుకుని విచారణ సాగిస్తున్నట్లు కొత్తపల్లి ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

# దేశ విభజన గాయాల స్మారక దినం సందర్భంగా..

# బిజెపి ఆధ్వర్యంలో మౌన ప్రదర్శన

కరీంనగర్, ఆగస్టు 14 (మనం న్యూస్)ః 'మేరీ మాటీ మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా బిజెపి కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 14 దేశ విభజన గాయాల స్మారక దినం సందర్భంగా సోమవారం స్థానిక తెలంగాణ చౌక్ నుండి కలెక్టరేట్ సమీపంలోని రెవెన్యూ గార్డెన్ వరకు మౌన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం రెవెన్యూ గార్డెన్‌లో దేశ విభజనకు సంబంధించిన డాక్యుమెంటరీ ప్రదర్శన, ఫోటో ఎగ్జిబిషన్, సభ ను నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ దేశానికి తామే స్వాతంత్రం తెచ్చామని , దేశానికి విముక్తి కలిగించామని నెహ్రూ కాలం నుంచి నేటి వరకు అదే పాట పాడుతుంది కానీ దీని వెనుక ఉన్న మరో దుర్మార్గం ప్రజలకు చెప్పడం లేదన్నారు. ఇప్పుడు దేశాన్ని ముక్కలు చేయించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. ఆనాడు దూర దృష్టి లేని కాంగ్రెస్ నేతల వల్ల దేశ విభజన గాయాల నుంచి నేటికీ మనం కోలుకోవడం లేదన్నారు. విభజన సమయంలో కాంగ్రెస్ పాత్ర మరువలేనిదని, స్వార్థం కోసం కాంగ్రెస్ విభజనకు అంగీకరించిందనే విషయం చరిత్ర చెబుతుందన్నారు. భారత స్వతంత్ర ఉద్యమంలో బ్రిటిషర్ల ధమనకాండ కన్నా, విభజన వల్ల జరిగిన రక్తపాతమే అధికమని , దాదాపు 10 లక్షల మంది ఊచ కోతకు గురయ్యారంటే , ఆ రక్తపాతం ఎంతగా పారిందో నేటితరం తెలుసుకోవాలన్నారు. బ్రిటిష్ వారు పోతూ పోతూ దేశాన్ని మత ప్రాతిపదికన విభజించే చిచ్చుపెట్టారని, ఒక్కటిగా ఉన్న భారతావనినీ ముక్కలు చేశారని తెలిపారు. దేశానికి వచ్చిన స్వాతంత్రం వచ్చిన సంబరం కంటే, దేశ విభజన కారణంగా జరిగిన రక్తతర్పణమే భయంకరంగా మారిందన్నారు. దేశ విభజన కారణంగా లక్షలాదిమంది ప్రజలు , ఊచ కోతకు గురయ్యారని, మహిళలు అత్యాచారానికి గురయ్యారని, ఆస్తులు లూటీ జరిగిందన్నారు. ముఖ్యంగా మతతత్వం మనుషులను ఎంత భయంకరంగా విభజిస్తుందో అన్నది మరువలేని గాయంగా మిగిలిందన్నారు. ఆజాది కా అమృత్ మహోత్సవాల ముగింపు




ఉత్సవాల సందర్భంగా దేశ విభజన గాయాలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కళ్లెం వాసుదేవ రెడ్డి, భత్తుల లక్ష్మీనారాయణ, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, నాయకులు బాస సత్యనారాయణ రావు, రంగు భాస్కరాచారి, రాపర్తి ప్రసాద్, కటకం లోకేష్, బొంతల కళ్యాణ్, సత్యనారాయణ రెడ్డి, సంకితి శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు కొలగాని శ్రీనివాస్, కాసర్ల ఆనంద్, పెద్దపెల్లి జితేందర్, బండ రమణారెడ్డి, పుప్పాల రఘు దుబాల శ్రీనివాస్ మాడ గౌతమ్ రెడ్డి ఆవుదుర్తి శ్రీనివాస్ మాడిశెట్టి సంతోష్ నరహరి లక్ష్మారెడ్డి, నాంపల్లి శ్రీనివాస్, రాపాక ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్ ను కలిసిన బిఆర్ఎస్ నాయకులు యాదగిరి



మానకొండూరు, ఆగస్టు 14 (మనం న్యూస్)ః మానకొండూరు తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన సిహెచ్.రాజును బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శాతరాజు యాదగిరి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల దస్తావేజు లేఖరులు మండల బక్కారెడ్డి, అడప వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం గ్రామ నూతన కమిటీ



జమ్మికుంట, ఆగస్టు 14 (మనం న్యూస్)ః తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం గ్రామ శాఖ అధ్యక్షునిగా రాచపెల్లి శ్రీకాంత్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని విలాసాగర్ గ్రామంలో సోమవారం మండల అధ్యక్షుడు రత్నం మహేష్ ఆధ్వర్యంలో గ్రామం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షులుగా రాచపెల్లి శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా రాచపెల్లి సుమన్, రాచపెల్లి చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా రాచపెల్లి రాజా శేఖర్, సంయుక్త కార్యదర్శిగా రాచపెల్లి గణేష్, చంద్రగిరి కుమార్, చంద్రగిరి రజినీకాంత్, కోశాధికారిగా రాచపెల్లి సమ్మయ్య, ప్రచార కార్యదర్శిగా రాచపెల్లి కుమారస్వామి, రాచపెల్లి రాజయ్య, రాచపెల్లి ఎల్లయ్య కార్యవర్గ సభ్యులుగా సందగల్ల రవి,రాచపెల్లి సంపత్,రాచపల్లి రాజ్ కుమార్, రాచపెల్లి అంకూస్, రాచపల్లి సంతు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి బత్తుల పాండు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మైస సాంబయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రాచపెల్లి వంశీ, మండల నాయకులు మోలుగురి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



# భార్యను హత్య చేసి.. భర్త ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఆగస్టు 14 (మనం న్యూస్)ః భార్యను హత్య చేసి మృతదేహాన్ని ఇంట్లో పెట్టి తాళం వేసిన అనంతరం భర్త ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన కరీంనగర్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం నగరంలోని మార్కండేయ కాలనీకి చెందిన వేముల ప్రవీణ్ (50) అతని భార్య లావణ్య (42)ను గత రెండు రోజుల క్రితం హత్య చేసి ఇంట్లో పెట్టి తాళం వేసి వెళ్లిపోయాడు. హాస్టల్‌లో ఉంటున్న అతని కూతురు దగ్గరకు వెళ్లిన ఆయన సోమవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చాడు. అనంతరం ఇంట్లోనే ఉరి వేసుకుని మరణించాడు. కుటుంబ కలహాల కారణంగానే ఈ దారుణం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# వాహనాల తనిఖీ



హుజురాబాద్ రూరల్, ఆగస్టు 14 (మనం న్యూస్)ః స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఎలాంటి అసాంఘిక ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పట్టణ శివారులో టౌన్ సీఐ బొల్లం రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. పరకాల క్రాస్ రోడ్‌తో పాటు శిరసాపల్లి క్రాస్ రోడ్ ప్రాంతంలో అనుమానిత వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలడిగి నమోదు చేసుకొని పంపించారు.

# అంగన్వాడీ విద్యార్థులకు పలకలు, పుస్తకాల పంపిణీ



హుజురాబాద్ రూరల్, ఆగస్టు 14 (మనం న్యూస్)ః స్థానిక గ్యాస్ గోదాం ఏరియాలోని అంగన్వాడీ కేంద్రం విద్యార్థులకు కల్కి భగవాన్ సేవాసమితి సభ్యులు సోమవారం పుస్తకాలు, పలకలు, పెన్నులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, కౌన్సిలర్ కల్లేపల్లి రమాదేవి, కల్కి భగవాన్ సేవా సమితి కమిటీ సభ్యులు కిషన్ రెడ్డి, అంగయ్య, కొమురయ్య, తిరుపతిరెడ్డి, లక్ష్మి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

## 11వ వేజ్ బోర్డు ఏరియర్స్ వెంటనే చెల్లించాలి



రామకృష్ణాపూర్, ఆగస్టు 14 (మనం న్యూస్): 11 వ వేజ్ బోర్డు ప్రకారం 23 నెలల ఏరియర్స్ ఆగస్టు నెల వేతనాలతో కలిపి సెప్టెంబర్ 3న చెల్లించాలని మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ గనుల వద్ద సోమవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి మేనేజర్ లకు మెమోరాండంలు అందించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి అక్బర్ అలీ మాట్లాడుతూ కోల్ ఇండియాలో ఒప్పందం జరిగినప్పటికీ సింగరేణి యాజమాన్యంలో ఉలుకు పలుకు లేదన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆర్కే ఓసిపి పిట్ కార్యదర్శి ఆంజనేయులు, మైనింగ్ స్టాఫ్ ఇంచార్జీ రాజేశ్వర రావు, ఆర్కే 1ఏ పిట్ కార్యదర్శి సురమళ్ళ వినయ్, సహెచ్పీ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాజశేఖర్, నాయకులు సంపత్, ఆవుల మల్లమ్మ, సంపత్, శ్రీధర్, గాజుల రాయమల్లు, సుంకరి గట్టయ్య, గోత్త గిరి ప్రసాద్, బాల్ రెడ్డి, చెంద్రకాని రమేశ్, వెంకటేశ్వర రెడ్డీ, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

## భారతదేశంలో విద్యా కమిటీలు పుస్తకం ఆవిష్కరించిన వినోద్ కుమార్



జమ్మికుంట, ఆగస్టు 14 (మనం న్యూస్): డాక్టర్ పుల్లూరి సంపత్ రావు రచించిన భారతదేశంలో విద్యా కమిటీలు అనే పుస్తకాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపల్లి రాజేశ్వర్ రావు, నాయకులు టంగుటూరి రాజ్ కుమార్, మునిపట్ల తిరుపతిరెడ్డి, కొలిపాక శ్రీనివాస్, పుల్లూరి సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో జాతీయ జెండాల పంపిణీ



కొత్తపల్లి, ఆగస్టు 14 (మనం న్యూస్): హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా కొత్తపల్లి పట్టణంలో మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు ఆధ్వర్యంలో వార్డు సభ్యులు సోమవారం ఇంటింటికి తిరిగి జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారి మమత, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు రుద్ర రాధ, సాయిరాం, రుద్ర రాజేందర్, ఆయా వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

## పాఠశాల స్వీపర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

### నగర కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి



కరీంనగర్, ఆగస్టు 14 (మనం న్యూస్): జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్ల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. స్వీపర్లకు కనీస వేతనం చెల్లించకుండా బిఆర్ఎస్ ప్రభుత్వం శ్రమ దోపిడీకి గురి చేస్తోందన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని గత ముప్పై రోజులుగా కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తోన్న రిలే దీక్షా శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా స్వీపర్లకు సంఘీభావం ప్రకటించిన ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేవలం ఐదు వేల 200 రూపాయల వేతనంతో పూర్తి స్థాయి పనిగంటలు పని చేయించుకోవడం శ్రమ దోపిడీయే అన్నారు. ఆ వేతనం కుటుంబ పోషణకు ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి స్వీపర్ల ఉద్యోగాలు రెగ్యులరైజ్ చేసి 26 వేల రూపాయల కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.



## కుక్కల దాడిలో విద్యార్థికి గాయాలు



మంచిర్యాల, ఆగస్టు 14 (మనం న్యూస్): కాసిపేట మండల కేంద్రంలో ఊర కుక్కలు కరిచి విద్యార్థికి గాయాల పాలయ్యాడు. మండల కేంద్రం నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శునకాలు విద్యార్థుల పై దాడి చేసి కరుస్తున్నాయి. గత కొన్ని రోజుల వ్యవధిలోనే సుమారు ఆరుగురు విద్యార్థులను కరవడం జరిగిందని కాసిపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషా తెలిపారు, సోమవారం ఉదయం నాలుగవ తరగతి చదువుతున్న విక్కి అనే విద్యార్థికి కుక్క కాటు వేయడంతో స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించి ఇంటి దగ్గర వదిలిపెట్టిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఊర కుక్కలు పాఠశాల గోడలు ఎక్కి, బాత్రూంల వద్ద, బిల్డింగ్ ల పైకి ఎక్కి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులను కూడా బేంబెలెత్తిస్తున్నాయని, స్థానిక పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకుండా కుక్కలు, జంతు ప్రేమికులు పేరిట పక్కకు తప్పుకుంటున్నారని తెలిపారు. ఈ కుక్కల బెడద నుండి విద్యార్థుల్ని ఉపాధ్యాయులని కాపాడాలని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం కుక్కలను నివారించలేకపోయినా పంచాయతీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కల బారి నుండి విద్యార్థులను, ఉపాధ్యాయులను కాపాడాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోరారు.

## లక్ష్మి రాజం హత్య కేసు సిబిఐకి అప్పగించాలని కోరుతూ..

## ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, రాస్తారోకో

కోరుట్ల, ఆగస్టు 14 (మనం న్యూస్): లక్ష్మి రాజం హత్య కేసు సిబిఐకి అప్పగించాలని కోరుతూ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఐలాపూర్ రోడ్డు పెద్దమ్మ దేవాలయం నుండి బస్టాండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం మీదుగా కార్గిల్ చౌక్ వరకు భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం కార్గిల్ చౌక్ వద్ద సుమారు గంటసేపు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ లక్ష్మిరాజంను సుపారి తీసుకుని హత్య చేసిన నిందితులను శిక్షించేందుకు వీలుగా కేసును సిబిఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. లక్ష్మిరాజం భార్య 9వ వార్డు కౌన్సిలర్ పోగుల ఉమారాణి మాట్లాడుతూ సుపారి తీసుకొని తన భర్తను హత్య చేశారని హత్య వెనక ఇంకా చాలామంది ఉన్నారని వారిని బయటకు తీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి కూరపాటి అరుణ జ్యోతి, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు పర్శ హన్మాండ్లు, బల్ల సత్తయ్య, ఉమ్మడి జిల్లా





అధ్యక్షుడు గుర్రాల మల్లేశం, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు పెద్దులు, పులి నర్సయ్య, ఉమ్మడి కరీంనగర్ జిల్లా యూత్ అధ్యక్షుడు పండుగ బాలు, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు కోడి అంతయ్య, కరీంనగర్ జిల్లా మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షులు పోలు లక్ష్మణ్, కోరుట్ల మండల సమైక్య సంఘం అధ్యక్షులు ఉరుమడ్ల శ్రీనివాస్ కార్యదర్శి జంగిలి గంగ నరసయ్య, జిల్లా యూత్ అధ్యక్షులు ఉరుమడ్ల చరణ్, కలల భూమసాయిలు, పాతర్ల నరసయ్య, పట్టణ అధ్యక్షులు, పీసరి అశోక్, ముదిరాజ్ మహాసభ మెట్పల్లి నియోజకవర్గం నాయకులు న్యాయవాది వెలుమల రాంబాబు, రేండ్ల రమేష్, అలువాల సత్య నారాయణ, ఉపాధ్యక్షులు అలువాల శంకర్, ప్రధాన కార్యదర్శి పోగుల లింగమూర్తి, కోశాధికారి కలాల అనిల్, ముదిరాజ్ సంఘం నాయకులు తుపాకుల బాజన్న, పొన్నం గోపాల్ జాగిలం భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# నివేశనా స్థలాల కోసం జర్నలిస్టుల పోరుబాట

**- తక్షణమే సమస్య పరిష్కరించకపోతే ఆమరణ దీక్షకు సిద్ధం**

**: టియుడబ్ల్యుజె జిల్లా అధ్యక్షులు తాడూరు కరుణాకర్**

**- జర్నలిస్టుల పోరాటానికి అన్ని రాజకీయ పక్షాల మద్ధతు**




కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 14 (మనం న్యూస్)ః తమ సమస్యల సాధన కోసం చాలాకాలం తరువాత జర్నలిస్టులు పోరుబాట పట్టారు. అవిగో, ఇవిగో అంటూ ఊరిస్తూ వస్తోన్న నివేశనా స్థలాల పంపిణీ ఇంకెప్పుడు అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని, స్థానిక ప్రజాప్రతినిధులను ప్రశ్నించారు. ఉద్యమగడ్డపై నివేశన స్థలాల కేటాయింపు ఇంకెన్నాళ్లు...? ఉద్యమ ఫలాలు మీకు..చెట్టు కింద బతుకులు మాకా ? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకెన్నాళ్లు ఎదురుచూపులు.. ఇకనైనా మాకు నివేశన స్థలాలివ్వాలంటూ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశల వారీగా ఆందోళనలు చేస్తామని, అవసరమైతే ఆమరణ దీక్ష చేయడానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఐజెయు) కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నివేశన స్థలాల కోసం జర్నలిస్టులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లా నలుమూలల నుంచి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమకు వెంటనే నివేశన స్థలాలివ్వాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ధర్నా శిబిరానికి అధికార బిఆర్ఎస్ పార్టీతో సహా అన్ని రాజకీయ పార్టీల నాయకులు హజరై తమ సంఘీభావం, మద్దతును ప్రకటించారు. ఈ సందర్భంగా బిజెపి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కటుకం మృత్యుంజయం మాట్లాడుతూ అన్ని వర్గాలను మోసం చేసిన మాదిరిగానే సీఎం కేసీఆర్ జర్నలిస్టులను కూడా మోసం చేశారని ఆరోపించారు. పత్రికలు, విలేకరుల ప్రాధాన్యత తెలిసి కూడా కేసీఆర్ వారికి కనీస హక్కు అయిన నివేశన స్థలాలు ఎందుకు ఇవ్వడం లేదో అర్థం కావడం లేదని అన్నారు. జర్నలిస్టులకు నివేశన స్థలాలు ఇవ్వాలని సిఎం కేసీఆర్ కు లేఖ రాస్తానని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు తన వంతు కృషిచేస్తూ ఆందోళనలకు పూర్తి మద్దతు తెలుపుతానని హామీనిచ్చారు. బిఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ టి.సంతోష్ కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టుల న్యాయమైన కోరికలను నెరవేర్చే బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఈ విషయమై కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ అందరి సమస్యలు తమ సమస్యలుగా బావించి వాటి పరిష్కారానికి కృషిచేసే జర్నలిస్టులే వారి సమస్యల కోసం ధర్నాలు చేయడం రాష్ట్ర ప్రభుత్వానికి సిగ్గుచేటన్నారు. జర్నలిస్టుల సమస్యల సాధన కోసం చేపట్టే ఆందోళనలకు పూర్తి సంఘీభావం, మద్దతు ఉంటుందని తెలిపారు. టీజెఏసీ చైర్మన్ వెంకటమల్లయ్య, కాంగ్రెస్ నుంచి నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మేన్నేని రోహిత్ రావు, వైద్యుల అంజన్ కుమార్, టిడిపి నుంచి టిడిపి జిల్లా అధ్యక్షుడు గంగాధర కనకయ్య, కల్యాడపు ఆగయ్య, ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్, ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి, సిపిఐ నుంచి సృజన్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి వాసుదేవరెడ్డి, వైకాపా నుంచి డాక్టర్ నగేష్, బిఎస్పీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. తెలంగాణ వస్తే మా బతుకులు మారుతాయని ఆశించి యాజమాన్యాలను సైతం ఎదిరించి తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టులు కీలకపాత్ర పోషిస్తే...వారికి కనీస అవసరాలు కూడా తీర్చకపోవడం అత్యంత బాధాకరమన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా నిలిచే జర్నలిస్టులకే ఈ పరిస్థితులుంటే సామాన్యుల పరిస్థితి ఇక చెప్పనక్కర్లేదని తెలిపారు. జర్నలిస్టులు తమ సమస్యల సాధన కోసం మీ కలాలకు పదును పెడితే పాలకులు దిగి వస్తారని, ధైర్యంగా ఆ దిశగా అడుగులు వేయాలని, మీకు మేమంతా అండగా ఉంటామని, మీ ఆందోళనలకు పూర్తి సంఘీభావం, మద్దతు ఉంటుందని ప్రకటించారు. టీయుడబ్ల్యూజె జిల్లా అధ్యక్షులు తాడూరు కరుణాకర్ మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం అరవై ఏళ్లుగా పోరాటాలు చేస్తోందని తెలిపారు. కరీంనగర్ జిల్లాకు సంబంధించి హుజురాబాద్, జమ్మికుంట జర్నలిస్టులకు అక్కడి ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి వారం, పది రోజుల్లో నివేశన స్థలాలు ఇవ్వనున్నట్లు హామీ ఇచ్చారని, కరీంనగర్ పట్టణానికి సంబంధించి మంత్రి గంగుల కమలాకర్ ఈ నెల 18న ఇస్తున్నట్లు హామీ ఇచ్చినట్లు తెలిసిందని, ఈ హామీలు అమలవుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. అలాగే మిగిలిన మండలాల జర్నలిస్టులకు ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు నివేశన స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశల వారీగా ఆందోళనలను ఉధృతం చేస్తామని, అవసరమైతే ఆమరణ దీక్ష చేయడానికి కూడా వెనకాడబోమని హెచ్చరించారు. ఇప్పటికైనా అర్హులైన జర్నలిస్టులందరికి నివేశన స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సంఘం జిల్లా కార్యవర్గంతో పాటు రాష్ట్ర, జాతీయ కౌన్సిల్ సభ్యులు, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక
కావలెను
'మనం' తెలుగు దినపత్రికకు ఈ దిగువ పేర్కొన్న సర్కిల్స్ పరిధిలో విలేకరులుగా పనిచేసేందుకు ఉత్సాహవంతులు కావలెను. చక్కటి రాత, తెలుగుభాషపై పట్టు ఉండి ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు కోరబడుతున్నవి.
కావలసిన ప్రాంతాలు :
మంచిర్యాల జిల్లా: మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, నస్పూర్, హాజిపూర్, లక్షేటిపేట్, దండెపల్లి, జన్నారం, కోటపల్లి, వేమనపల్లి, జైపూర్, భీమారం, కన్నెపల్లి, నెన్నెల్, భీమిని, తాండూర్, కాసిపేట.
ఆసిఫాబాద్ జిల్లా: కాగజ్‌నగర్, సిర్పూర్(టి), కౌటాలా, చింతలమానెపెల్లి, పెంచికలపేట్, బెజ్జూరు, దహేగాం, రెబ్బెన, వాంకిడి, జైనూర్, కెరమెరి, సిర్పూర్(యు), తిర్యాని.
మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
నిర్మల్ జిల్లా: నిర్మల్, ముథోల్, ఖానాపూర్ నియోజక వర్గాలు మరియు మండలాల వారిగా
ఆదిలాబాద్ జిల్లా: అదిలాబాద్, బోథ్ నియోజక వర్గాలు మరియు మండలాల వారిగా
మనం
జనం కోసం... అక్షర యజ్ఞం...
తెలుగు దినపత్రిక
పూర్తి వివరాలకై సంప్రదించవలసిన ఫోన్ నం:
సెల్ : 96666 99086, 83339 98076